సాక్షి
జనగామ

గురువారం । 27 । జూన్ । 2024



కేటీపీపీలో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

కేటీపీపీలో మొదటి దశ 500 మెగావాట్లు, రెండవ దశ 600 మెగావాట్ల ప్లాంట్లలో బాయిలర్ ట్యూబ్ లీకేజీతో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. - 8లో



విద్యుత్ పనులు త్వరగా పూర్తి చేయాలి - 8లో

కేఎంటీపీలో చేపట్టిన విద్యుత్ సరఫరా పనులు త్వరగా పూర్తి చేయాలని టీజీ ఎన్పీడీసీ ఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం $30^0/25^0$

ఉదయం నుంచి ఆకాశం పూర్తిగా మేఘావృతమై వాతావరణం చల్లగా ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి.

న్యూస్‌రీల్

తాత్కాలిక నియామకం

జనగామ రూరల్: జనగామ మండలం చౌడారం మోడల్ పాఠశాల, కళాశాలలో సాంఘిక శాస్త్రం 9, 10 తరగతి వారికి బోధించడానికి తాత్కాలిక పద్ధతిన నియామకానికి ఆసక్తి ఉన్న అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వి.త్రిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో పొలిటికల్ సైన్స్, బీఎడ్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. బోధన ఇంగ్లిష్ మీడియంలో చేయాల్సి ఉంటుందని, జిల్లాకు చెందిన స్త్రీ, పురుష అభ్యర్థులు ఈనెల 28లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 96529 88323 నంబర్ సంప్రదించాలని సూచించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్




జనగామ రూరల్: యశ్వాంతాపూర్‌లో బుధవారం సాయంత్రం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. ఎల్లమ్మ దేవాలయం సమీపాన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు పట్టుకున్నారు. వారు గంజాయి విక్రయిస్తున్నట్లు తెలియడంతో అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. విచారణ చేపట్టగా పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన గంట బాబు, మరొక మైనర్ వద్ద నుంచి 700 గ్రాముల గంజాయి పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ రఘు తెలిపారు. గంజాయి విలువ రూ.15,000 ఉంటుందన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చిల్పూరు: మహిళా సంఘాలను ఐదేళ్లలో కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది.. వాటిని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ(సెర్ప్) ప్రాజెక్టు మేనేజర్ సమ్మక్క అన్నారు. మహిళా శక్తిపై బుధవారం మండల కేంద్రంలో ఐకేపీ వీఓ, వీఏఓల అధ్యక్షులకు ఏపీఎం రమేష్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లాకు 13 యూనిట్లు మంజూరు కాగా అందులో సూక్ష్మ సంస్థలు, పాడిగేదెలు, పెరటి కోళ్లు, మదర్ యూనిట్లు ఉన్నాయన్నారు. అలాగే మండలానికి ప్రత్యేకంగా చిల్పూరు, పల్లగుట్ట, లింగంపల్లి, రాజవరం గ్రామాలకు మీ–సేవ కేంద్రాలు మంజూరయ్యాయని తెలిపారు. మండలానికి ఆరు ఆహార ఉత్పత్తి కేంద్రాలు మంజూరయ్యాయని, వీఓల తీర్మానంతో వీటిని సంఘాలకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. డీపీఎం ఫైనాన్స్ అధికారి వరలక్ష్మి, గట్టు శ్రీనివాస్‌గౌడ్, కనకచంద్రం, రమాదేవి, శోభ, ఏదునూరి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ న్యాయం చేస్తాం



చిల్పూరు: శ్రీపతిపల్లిలో ఆక్రమణకు గురైన సీలింగ్ భూములపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి అందరికీ న్యాయం చేస్తామని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్న అన్నారు. బుధవారం తహసీల్దార్ సరస్వతి, డీటీ విమల, ఆర్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. ఇంతకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 40 మంది పేదలకు ఎకరం చొప్పున సీలింగ్ భూమి ఇచ్చారని, గ్రామానికి చెందిన కొందరు పట్టా పాస్ బుక్కులు ఇప్పిస్తామంటూ డబ్బులు తీసుకుని కేవలం 34 మందికి ఎకరానికి బదులు 20 గుంటలే పాస్‌బుక్కులు ఇప్పించారని చెప్పారు. మిగతా ఆరుగురి భూమిని సాదాబైనామాలతో ఇతరులకు పట్టాచేసి అమ్ముకున్నారని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ రంగు రమేష్‌గౌడ్, మాలోతు రాజు, పాలబోయిన నరేష్, మోతె మహేష్, కావలి రాజు, వెంకటయ్య, మోతె రజనీకాంత్, పోషయ్య, కొంరయ్య, మోతె ఉపేందర్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల జోరు

కాజీపేట అర్బన్ : వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో బుధవారం రిజిస్ట్రేషన్ల జోరు కొనసాగింది. ఆగస్టు 1నుంచి భూమి మార్కెట్ విలువలు పెరుగుతున్న తరుణంలో క్రయవిక్రయదారులు, రిజిస్ట్రేషన్లను పూర్తి చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 167 దస్తావేజులు రిజిస్ట్రేషన్లు పూర్తికాగా, ఖజానాకు సుమారు రూ.90 లక్షల ఆదాయం సమకూరింది. పెరగనున్న మార్కెట్ విలువతో అధిక మొత్తంలో రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించకుండా అప్రమత్తమవుతున్నారు.

కమ్ముకున్న కరువు మేఘం

జిల్లాలో చినుకు జాడలేదు

- వాడి పోతున్న పత్తి మొలకలు
- ఇప్పటికే రెండుసార్లు విత్తిన రైతులు
- ఎండిపోతున్న నారు మడులు
- వరణుడి కరుణ కోసం అన్నదాతల ఎదురుచూపు

ఫోకస్ సాక్షి ఫోకస్

జనగామ: జిల్లాను కరువు మేఘాలు కమ్ముకుంటున్నాయి. సీజన్‌లో తొలకరి పలకరించినా.. ఇప్పటి వరకు భారీ వర్షం కురవలేదు. ఇటీవల అడపదడపా పడిన వానలతో పెద్దగా ప్రయోజనం లేకుండాపోయింది. ఎక్కడా భూమి తడవలేదు. పగటి పూట ఉష్ణోగ్రతలు ఎండాకాలాన్ని తలపిస్తున్నాయి. సాగునీరు అందక నాటిన పత్తి గింజలు భూమిలో మగ్గి పోతున్నాయి. అక్కడక్కడా బయటకువచ్చిన మొలకలు వాడిపోతున్నాయి. నారు మళ్లు ఎండుతున్నాయి. వరుణుడి కరుణ కోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే 10 నుంచి 20 శాతం పత్తి విత్తనాలు మొలకెత్తే దశలో నేలలో కలిసి పోయాయి. వరి నార్లకు సైతం పెద్ద దెబ్బ ఉంటుందని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో 1.80లక్షల ఎకరాల్లో వరి, 1.26లక్షల ఎకరాల్లో పత్తి, 2,500 ఎకరాల్లో మొక్కజొన్న, 3,100 ఎకరాల్లో కందులు, 2,600 ఎకరాల్లో మిర్చి ఇతరత్రా కలుపుకుని 3.70లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటి వరకు 3వేల ఎకరాల్లో పంటలు సాగవగా.. అనధికారికంగా 65వేల ఎకరాలు ఉండొచ్చని అంచనా.



తమ్మడపల్లి(జి)లో మొలకెత్తని పత్తి విత్తనాలు



భూమిలోనే నిర్వీర్యమైన విత్తనం

అడుగంటిన భూగర్భ జలాలు

వర్షాలు లేక రిజర్వాయర్లలో నీటిమట్టం అంతకంతకూ తగ్గుతోంది. చెరువులు, వాగులు వట్టిపోయాయి. ఫలితంగా భూగర్భజలాలు రోజురోజుకూ అడుక్కు వెళ్తున్నాయి. వ్యవసాయ బోర్లు, బావుల్లో నీటి లభ్యత తగ్గిపోయింది. ఒకటి, రెండు మడులు కూడా తడిసే పరిస్థితి లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో చాలా చోట్ల వందలాది మంది రైతులు పత్తి గింజలను రెండేసి మార్లు నాటారు. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. మరో పదిరోజులు వర్షాభావ పరిస్థితులు ఇలానే ఉంటే పెట్టుబడులు పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

జూన్‌లో మండలాల వారీగా వర్షపాతం వివరాలు(మిల్లీమీటర్లలో)

మండలం	కురవాల్సింది	కురిసింది
తరిగొప్పుల	94.2	98.6
చిల్పూరు	113.4	169.6
జఫర్‌గఢ్	101.6	115.2
స్టేషన్‌ఘన్‌పూర్	125.7	67.2
రఘునాథపల్లి	110.2	92.9
నర్మెట	97.9	131.0
బచ్చన్నపేట	88.1	110.5
జనగామ	91.6	60.4
లింగాలఘణపురం	91.0	112.1
దేవరుప్పుల	88.2	103.9
పాలకుర్తి	112.1	137.5
కొడకండ్ల	92.9	125.0

కంటితుడుపు వాన..

జిల్లాలో 20 రోజుల తర్వాత బుధవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. ఈనెల 7న 28.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, బుధవారం రాత్రి వరకు 24.2 మిల్లీమీటర్ల వర్షం వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. జనగామలో 57.5, బచ్చన్నపేట 23.5, రఘునాథపల్లి 46.5, పాలకుర్తి 4.5, లింగాలఘణపురం 29, దేవరుప్పుల 13.5, తరిగొప్పుల 1.8, నర్మెట 13.8, చిల్పూరు 13.5, స్టేషన్‌ఘన్‌పూర్ 17, జఫర్‌గఢ్ 0.5, కొడకండ్ల 4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సీజన్ ప్రారంభంలో విత్తిన పత్తిగింజలు మొలకెత్తకపోవడంతో చాలా మంది రైతులు రెండోసారి విత్తారు. భారీ వర్షం కోసం ఎదురుచూస్తున్న సమయంలో వర్షం కురిసినా.. కంటితుడుపే.. భూమి తడిసే పరిస్థితి లేదని రైతులు పేర్కొన్నారు.

పత్తి చేనులో గుంటుక తోలుతున్న రైతు



ఇప్పటికైతే ఇబ్బంది లేదు

కొడకండ్ల : గడిచిన వారంలో రెండు రోజుల పాటు వర్షం కురిసింది. మొలకెత్తిన పత్తి విత్తనాలకు కొంత ఊపిరి వచ్చినట్లే. రైతులు పత్తి చేలల్లో కలుపు నివారణ పనుల్లో నిమగ్నమయ్యారు. పత్తి మొలకలు, నారుమడులకు ఇప్పటి వరకు ఇబ్బంది లేదు.

లాభం..నష్టం



పాలకుర్తి/పాలకుర్తి టౌన్ : మండలంలో పంటల పరిస్థితి కొంత లాభం.. మరికొంత నష్టం అన్నట్టుగా ఉంది. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలతో పత్తి విత్తనాలు మొలకెత్తాయి. పలు గ్రామాల్లో గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి.

ఒక్క గింజా మొలవలే..



ఐదు ఎకరాల్లో పత్తి గింజలు నాటా. వర్షాలు లేక విత్తనాలు భూమిలోనే కలిసి పోతున్నాయి. ఒక్కటి కూడా మొలకెత్తలేదు. వరుణుడు కరుణిస్తాడని ఆశగా ఎదురు చూస్తున్నా. చినుకు రాలక ఇప్పటికే రూ.50 వేల పెట్టుబడి నష్టం జరిగింది.

- బర్ల భగవంతు, రైతు, విస్నూరు

మామూలు వర్షపాతమే..

నర్మెట: మండలంలో రెండు రోజుల క్రితం మామూలు వర్షం కురిసింది. 20 రోజుల వ్యవవధిలో రైతులు పత్తి విత్తనాలు నాటారు. 30 నుంచి 40 శాతమే మొలకెత్తాయి. అవి ఇప్పటి వరకైతే వాడిపోలేదు. ఎర్ర భూములతో పోల్చి చూస్తే నల్లరేగడి నేలల్లో 10 శాతం అధికంగా మొలకెత్తాయి.



ఇబ్రహీంపూర్‌లో వాడిపోతున్న పత్తి మొక్కలకు నీరు అందిస్తున్న రైతు

రెండోసారి విత్తిన..



రఘునాథపల్లి : రోహిణి, మృగశిర పోయాయి.. ఆరుద్ర కార్తె వచ్చినా సరైన వర్షాలు పడలేదు. మొదటి వర్షానికి పత్తి గింజలు నాటిన. వాన జాడ లేక విత్తనాలు భూమిలోనే పుచ్చిపోయాయి. రెండోసారి నాటితే అదే పరిస్థితి నెలకొంది. **- నూనె కొమురెల్లి, రైతు, ఇబ్రహీంపూర్(రఘునాథపల్లి)**

చినుకు చుక్క లేదు



లింగాలఘణపురం : వానలు పుష్కలంగా కురుస్తాయని చెప్పడంతో 15 రోజుల క్రితం నారు పోసిన. ఇప్పటికీ చుక్క చినుకులేదు. బావి, బోర్లలో నీరు లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే నార్లు ముదిరిపోయే ప్రమాదం ఉంది. దేవాదుల కాల్వ ద్వారా చెరువు నింపితే భూగర్భ జలాలు పెరిగి పంటలకు నీరు అందించే వీలు ఉంటుంది. **- బొంకూరి రమేష్, రైతు, లింగాలఘణపురం**

రూ.30వేలు నష్టపోయా..



దేవరుప్పుల : నాకున్న ఐదెకరాలకు మరో రెండెకరాలు కౌలుకు తీసుకుని మొత్తం 7 ఎకరాల్లో పతి విత్తనాలు నాటినా. 15 రోజుల నుంచి వానలు లేవు. వచ్చిన మొలకలు ఎండిపోయాయి. రూ.30వేల వరకు పెట్టుబడి నష్టమైంది. మళ్లీ దున్నకాలు చేపట్టి విత్తనం వేయాలె. **- గోలి శ్రీనివాసరెడ్డి, రైతు, దేవరుప్పుల**

మొలకెత్తని విత్తనాలు

స్టేషన్‌ఘన్‌పూర్: మండల పరిధి పలు గ్రామాల్లో పత్తి విత్తనాలు, వరి నార్లు ఎండిపోతున్నాయి. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలకు సాగు నీరు అందక, అదును దాటిపోతుండడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు.

విత్తనం పెట్టి రెండు వారాలైంది



నాకు శివునిపల్లిలో ఉన్న రెండెకరాల్లో పత్తి సాగు చేసిన. రెండు వారాల క్రితం నాలుగు ప్యాకెట్ల విత్తనాలు నాటాను. దున్నకాలు, విత్తనాలు, కూలీలకు రూ.10వేల వరకు ఖర్చు అయింది. రెండు వారాలుగా వాన చినుకు లేదు. నాటిన విత్తనాలు భూమిలోనే ఉండిపోయాయి. వర్షాలు లేక పెట్టుబడి నష్టపోవాల్సి వస్తుంది.

- బాలబోయిన కిష్టయ్య, రైతు, శివునిపల్లి

ముసురు వానే..



జఫర్‌గఢ్: మండలంలో 15 రోజుల క్రితం ఐదు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. అప్పటి నుంచి పెద్దగా వానలు పడలేదు. విత్తిన గింజలు భూమిలో కలిసి పోయాయి. రెండోసారి 15 ప్యాకెట్ల విత్తనాలు నాటిన. ముసురు తప్ప మోస్తారు వాన పడలేదు. ఇప్పుడు వేసిన విత్తనం పరిస్థితీ అలానే ఉంది.

- కొంత నరసయ్య, రైతు, తమ్మడపల్లి(జి)

ఆరోగ్యవంతమైన జిల్లాగా తీర్చిదిద్దాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా, పక్కన డీసీపీ రాజమహేంద్రనాయక్, అధికారులు

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: జిల్లాను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం కలెక్టర్, డీసీపీ, ఏసీపీలు, ఇతర అధికారులు మిషన్ పరివర్తన కింద జిల్లా కేంద్రంలో మానవహారం ఏర్పాటు చేసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కామాక్షి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. యువత మత్తుకు బానిసైతే సమాజానికి ప్రమాదమని, ముఖ్యంగా మాదకద్రవ్యాలు మనిషి ఆలోచనా పరిజ్ఞానం, పరిపక్వతను, సామర్థ్యాన్ని హరించి వేస్తాయన్నారు. అలాగే అతిగా మొబైల్ ఫోన్ వాడినా విద్యార్థుల ఏకాగ్రతను నశింపజేస్తుందన్నారు. మద్యపానం, ధూమపానంతోనూ ఇలాంటి పరిణామాలే ఉంటాయని పేర్కొన్నారు. ఎవరైనా మత్తుపదార్థాలు విక్రయించినా.. వినియోగించినా తమ దృష్టికి తీసుకువస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 14446 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇచ్చిన వారికి తగిన పారితోషికం అందజేయనున్నట్లు వివరించారు. అన్ని మండల కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ఈ నంబర్‌ను ప్రదర్శించడంతో పాటు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. డీసీపీ రాజమహేంద్రనాయక్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రతీ స్కూల్‌లో వారంలో ఒక రోజు విద్యార్థుల బ్యాగ్‌లను తనిఖీ చేసే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని, వారిలో ఏమైనా మార్పు కనిపిస్తే కౌన్సెలింగ్ ఇవ్వాలని తెలిపారు. అనంతరం అధికారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. సెల్ఫీ పాయింట్, సంతకాల సేకరణ నిర్వహించారు. అంతకు ముందు మిషన్ పరివర్తన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. డీడబ్ల్యూఓ జయంతి, డీఈఓ రాము, డీఎంహెచ్ఓ హరీశ్‌రాజ్ ఎక్సైజ్ సీఐ ప్రభావతి, రిసోర్స్ పర్సన్ డాక్టర్ సిద్ధారెడ్డి, ఎఫ్ఆర్వో పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం శామీర్‌పేట అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందించే ఆహారాన్ని పరిశీలించాలని, భోజనం నాణ్యత, శుచి రుచికరంగా ఉండాలని చెప్పారు. ఆహారం వండే పాత్రల విషయంలో పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. కేంద్రానికి వచ్చిన కోడిగుడ్ల నాణ్యతను పరిశీలించి రోజూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు లెక్క ప్రకారం అందించాలని అన్నారు. బలహీనంగా ఉన్న పిల్లల బరువు, ఎత్తు, కొలతలు ప్రతీ వారం తీసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సీడీపీఓలు, సూపర్‌వైజర్లు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించాలని చెప్పారు. కలెక్టర్ వెంట డీడబ్ల్యూఓ జయంతి, సీడీపీఓ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి

- ఏబీవీపీ జిల్లా కన్వీనర్ తోట హృతిక్‌సాయి

జనగామ రూరల్: విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతోపాటు ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ తోట హృతిక్‌సాయి డిమాండ్ చేశారు. సంఘం ఇచ్చిన పిలుపుతో బుధవారం జిల్లాలో పాఠశాలల బంద్ విజయవంతం అయిందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని, నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్తీక్, నితీష్, వంశీ, హర్షవర్ధన్, అరుణ్, వీరేందర్, మహేందర్, సందీప్, అరవింద్ పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నినాదాలు చేస్తున్న ఏబీవీపీ నాయకులు

అక్రమార్కులకు 'ఏసీబీ' ఝలక్!

దూకుడు పెంచిన అవినీతి నిరోధక శాఖ

- అవినీతి, అక్రమార్కులపై పెరిగిన నిఘా
- ఐదు నెలల్లో ఏడుగురి పట్టివేత.. ఆదాయం వచ్చే శాఖల వారే అధికం
- అన్ని శాఖలపైనా నిఘా పెట్టిన వైనం.. రవాణాశాఖపై వరుస దాడులు
- అక్రమార్కుల్లో మొదలైన దడ



ఏసీబీకి పట్టుబడిన కమలాపూర్ తహసీల్దార్(ఫైల్)



ఏసీబీకి చిక్కిన సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా(ఫైల్)



సాక్షిప్రతినిధి, వరంగల్: అవినీతి, అక్రమార్కులపై ఏసీబీ కొరడా ఝుళిపిస్తోంది. ఐదు మాసాల వ్యవధిలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏడుగురు అక్రమార్జనకు పాల్పడుతున్న వారి ఆట కట్టించిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అన్ని శాఖలపైనా నిఘా పెట్టడం చర్చనీయాంశం అవుతోంది. పట్టుబడిన వారిలో విద్యా, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ఆరోగ్యశాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు ఉన్నారు. ఉమ్మడి వరంగల్ పరిధిలో ఐదేళ్లలో 41 మంది ఏసీబీకి చిక్కారు. ఇందులో చాలామంది బయటకు నిజాయితీ కలిగిన అధికారులుగా నమ్మించిన వారు కావడం గమనార్హం.

అవినీతి పరులు ఉక్కిరి బిక్కిరి..

ఏసీబీ పకడ్బందీ వ్యూహంతో దాడులు చేస్తోంది. ఈ ఏడాది జనవరి 5న విద్యాశాఖ (కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ (ఆడిట్ విభాగం) అధికారులపై దాడులతో శ్రీకారం చుట్టిన అధికారులు ఆ పరంపరను కొనసాగిస్తుండడం కలకలం రేపుతోంది. ఓ ఫార్మసిస్టు నుంచి రూ.50 వేలు తీసుకుంటుండగా జనవరి 11న జనగామ డీఎంహెచ్ఓ, జూనియర్ అసిస్టెంట్‌లను పట్టుకున్నారు. మార్చి 4న తొర్రూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అక్రమాస్తులపై దాడులు నిర్వహించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ కోసం మార్చి 22న రూ.19,200లు తీసుకున్న మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహమ్మద్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కేసు ఎత్తివేసేందుకు ఆర్టీసీ డ్రైవర్ నుంచి రూ.20 వేలు లంచంగా తీసుకుంటుండగా ఏప్రిల్ 15న హుజూరాబాద్ డీఎం హనుమకొండలో ఏసీబీకి చిక్కారు. సబ్ రిజిస్ట్రార్ తస్లీమాపై అక్రమాస్తుల కేసును ఏప్రిల్ 22న నమోదు చేశారు. కమలాపూర్ మండల కన్నూరుకు చెందిన ఓ రైతు నుంచి వ్యవసాయ భూమి గిఫ్ట్ రిజిస్ట్రేషన్ కోసం రూ.5 వేలు లంచం తీసుకుంటుండగా తహసీల్దార్, కంప్యూటర్ ఆపరేటర్‌లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మే 28 నుంచి జూన్ 5 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఏసీబీ రవాణాశాఖ కార్యాలయాలపై దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, జనగామ ఆర్టీఏ కార్యాలయాలలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించడం కలకలం రేపింది. అన్ని ప్రభుత్వశాఖలపైనా ఏసీబీ ఆరా తీస్తుండటం అవినీతిపరులను ఆందోళనకు గురిచేస్తోంది.

ఐదేళ్లలో ఏసీబీ కేసులు ఇలా...

సంవత్సరం	కేసుల సంఖ్య
2020	07
2021	07
2022	09
2023	11
2024	07

(జూన్ 26 వరకు)

లంచం కోసం వేధిస్తే ధైర్యంగా ఫిర్యాదు చేయండి

ఏ ప్రభుత్వశాఖలోనైనా పనిచేసే అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది లంచం కోసం వేధిస్తే ఏసీబీ అధికారులను సంప్రదించండి. చట్ట ప్రకారం చేయాల్సిన పనులను చేయకుండా డబ్బులు డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064, లేదా వరంగల్ రేంజ్ డీఎస్పీ 91543-88912లకు ఫిర్యాదు చేయండి. ఇన్‌స్పెక్టర్ 91543-88913 నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వండి. లేదంటే నేరుగా ఏసీబీ కార్యాలయానికి వచ్చి కూడా ఫిర్యాదు చేయవచ్చు. సమాచారం ఇచ్చే వారి పేర్లు, వివరాలు గోప్యంగా ఉంటాయి.

- సాంబయ్య, డీఎస్పీ, ఏసీబీ, వరంగల్

సమస్యలు త్వరగా పరిష్కరించాలి

- జీపీ కార్మికుల డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా

జనగామ రూరల్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీపీ కార్మికులు కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా చేపట్టారు. బుధవారం ఉదయం క్రిస్టియన్ గ్రౌండ్ నుంచి కలెక్టరేట్ వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించలేదని, ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. ఎనిమిది నెలల పెండింగ్ వేతనాలు, మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దుపై తక్షణమే జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ వద్దకు చేరిన సీపీఓ ఇస్మాయిల్‌కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కె.మల్లాచారి అధ్యక్షతన సభ జరిగింది. సంఘం నాయకులు గూడూరు భాస్కర్, నారోజు రామచంద్రం, బత్తిని వెంకన్న, బసవ రామచంద్రు, పి.మల్లేష్, సోమన్న, ఎన్.యాకన్న, కె.రాజు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న జీపీ కార్మికులు

క్లుప్తంగా

రైలు ఢీకొని గొర్రెల కాపరి మృతి

● ఎల్గూర్ -నెక్కొండ రైల్వే స్టేషన్ల మధ్య ఘటన



కృష్ణమూర్తి(ఫైల్)

కాశిబుగ్గ: గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ గొర్రెల కాపరి మృతి చెందాడు. జీఆర్పీ సీఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా సంగెం మండలం ఎల్గూర్ రంగంపేటకు చెందిన బోనాల కృష్ణమూర్తి(48) భార్య చనిపోవడంతో పెద్ద కుమార్తె, అల్లుడితో కలిసి ఉంటూ గొర్రెలను కాసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి సరిగా చెవులు వినబడవు. బుధవారం గొర్రెలకు గడ్డి కోసుకురావడానికి రైలు పట్టాలు దాటుతుండగా డౌన్‌లైన్‌లో వెళ్తున్న గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. దీంతో తల పగిలి, కాళ్లు చేతులు విరిగి తీవ్ర గాయాలపాలై ట్రాక్ పక్కన పడి మృతి చెందాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్ కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి, పెద్ద కుమార్తె మానసకు అప్పగించామని సీఐ తెలిపారు.

చెట్టును ఢీకొని ఒకరు..



రాజు (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం శివారులో రోడ్డు పక్కన ఉన్న తాటిచెట్టును మోటార్‌బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో మొలుగూరి రాజు(42) మృతిచెందాడు. మంగళవారం రాత్రి జరిగిన ఈఘటనకు సంబంధించి రాజు భార్య పోలీస్‌స్టేషన్‌లో అందించిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి.. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన రాజు వ్యక్తిగత పనుల నిమిత్తం మంగళవారం రాత్రి తన ద్విచక్రవాహనంపై రంగరాయగూడెం నుంచి ఇప్పగూడెం వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో ఇప్పగూడెం శివారులో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న తాటిచెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజు బైక్‌తో సహా పక్కనే ఉన్న గుంతలో పడ్డాడు. ఈక్రమంలో తీవ్రంగా గాయపడిన రాజును స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ రాత్రి 11గంటల సమయంలో మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ముస్కు రాజు, ఎస్సై నాగరాజు తెలిపారు.

అన్నదాతకు బాసటగా..

● కర్షకులకు వెన్నుదన్నుగా కేవీకే శాస్త్రవేత్తలు
● వ్యవసాయ ఖర్చులు తగ్గించడంలో పలు సూచనలు
● నూతన వ్యవసాయ సాగు విధానాలపై అవగాహన



మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యాలయం



వేరుశనగ పంటలో పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



పాడి పశువుల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త సాయికిరణ్

ఖిలా వరంగల్: ఆధునిక వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ అధిక దిగుబడులు సాధించేలా మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) బాసటగా నిలుస్తోంది. వ్యవసాయంతోపాటు, కోళ్లు, గొర్రెలు, మేకలు, చేపల పెంపకం, చిరుధాన్యాలతో పలు ఉత్పత్తుల తయారీపై అవగాహన కార్యక్రమాలతో రైతులకు మరింత చేరువవుతోంది. ఈక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా డాక్టర్ రాజన్న బాధ్యతలు స్వీకరించిన తర్వాత కేవీకేను సందర్శించే వారి సంఖ్య ఎక్కువైంది.

మామునూరు కేవీకేను ప్రభుత్వం 50 ఎకరాల విస్తీర్ణంలో 2010 డిసెంబర్ 29వ తేదీన ఏర్పాటు చేసింది. ప్రస్తుతం వరంగల్, హనుమకొండ, ములుగు భూపాలపల్లి, జనగామ జిల్లాలో కేవీకే కార్యకలాపాలు కొనసాగుతోన్నాయి. మొదట్లో చిరుధాన్యాల పరిశోధనకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారు. కాలక్రమంలో వచ్చే మార్పులకు అనుగుణంగా కేవీకే విధానాలు మార్చుకుంటూ వచ్చింది. ప్రస్తుతం పత్తి, వరి, మిర్చి, మొక్కజొన్న, ప్రత్యామ్నాయ పంటలను రైతులకు పరిచయం చేస్తున్నారు. పంటల్లో దోమ నివారణ, టాప్ వర్కింగ్ అంటుకట్టే విధాలనాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ విశ్వ విద్యాలయం, కేవీకేలో శాస్త్రవేత్తలు కనుగొన్న నూతన సాంకేతిక అంశాలను శాస్త్రవేత్తలు.. రైతులకు చేరవేస్తున్నారు. ఈక్రమంలో కేవీకేతో పెరిగిన అనుబంధంతో రైతులు నూతన వ్యవసాయ విధానాలు తెలుసుకునేందుకు శాస్త్రవేత్తలను సంప్రదిస్తున్నారు. వివిధ శాఖలతోపాటు పలు స్వచ్ఛంద సంస్థలను కలుపుకుంటూ.. రైతులకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలను కేవీకే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

వివిధ విభాగాల ద్వారా..

మామునూరు కృషివిజ్ఞాన కేంద్రం ఐదు జిల్లాల పరిధిలో హార్టీకల్చర్, ఐటీడీఏ, శిశుసంక్షేమశాఖ, గృహవిజ్ఞానం వెటర్నరీ, ఎక్స్‌టెన్షన్ ఉన్నాయి. ఈశాఖలు ద్వారా పలు సేవలు అందిస్తున్నాయి. చీడల నివారణ, పశువుల పెంపకం, క్రిమిసంహారక, ఎరువుల వాడకం వంటి విభాగాలు ఉన్నాయి. ప్రధానంగా నూతన వంగడాల పరిచయం, సాగు పద్ధతులు నేర్పడం, డ్రిప్ సీడర్‌తో వరిసాగు, జీరో టిల్లేజీ పద్ధతులతో మొక్కజొన్న సాగు వంటి అంశాలతోపాటు రాజశ్రీ పెరటికోళ్లు, గొర్రెలు, చేపలు పెంపకం ద్వారా రైతులకు ఆదనపు ఆదాయం వచ్చే పద్ధతులపై శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకం కింద గిరిజన రైతులకు తక్కువ ధరలకు కోడి పిల్లలు, గొర్రెలను అందజేస్తున్నారు. నూతన వంగడాలపై ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. స్థానిక వాతావరణ పరిస్థితులకు తట్టుకునే విత్తనాలు రూపొందిస్తున్నారు. ఈక్రమంలో కొత్తగా వచ్చిన వరివంగడాలతోపాటు శ్రీవరి సాగులో ఎంతో మంది రైతులకు శిక్షణ ఇచ్చారు. మహిళలకు కిషోర్ బాలికలకు పోషక పదార్థాలు, ఆరోగ్య పరిరక్షణ కోసం విలువైన సూచనలు అందిస్తున్నారు. పాడి రైతులకు అవసరమైన 11రకాల గడ్డిజాతులను ప్రదర్శిస్తూ, జాతీయ చిరు ధాన్యాల పరిశోధన సంస్థ, సహకారంతో ఆరు రకాల చిరుధాన్యాలను రైతులను అందించడానికి కృషి చేస్తున్నారు. ఈఏడాది నుంచి కేవీకేలో పండ్ల తోటల పెంపకానికి సన్నహాలు ప్రారంభమయ్యాయి. దీంతోపాటు, మహిళలకు చిరు ధాన్యాలతో రాగిలడ్డు, కొర్రలతో దోశ, ఇడ్లీ, పులుహోర, ఉత్పత్తులు తయారు చేసే విధానంపై మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

సమీకృత వ్యవసాయ పద్ధతులు

వ్యవసాయంలో రైతులకు వాతావరణ మార్పుల ద్వారా పంట నష్టం అధికంగా ఉంటోంది. దీనిని నివారించుకోవడానికి నూతన ఆధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగిస్తూ వ్యవసాయంతోపాటు పాడి, మత్స్య, సంపద, పెరటి కోళ్ల పెంపకం, పశువులలో కృత్రిమ గర్భదారణపైన అవగాహన, 250లింగ నిర్ధారణ వీర్యం స్ట్రాస్‌ని పంపిణీ చేయడం జరిగింది. చేపల పెంపకంపైన శిక్షణలు కొర్రమేను, ఫంగస్ స్కాంపి రొయ్యల, మిశ్రమ చేపల పెంపకంతోపాటు నర్సరీ, మేత యాజమాన్యంపై బయో ఫ్లాగ్ పద్ధతిలో చేపల పెంపకం, చేప పేను వ్యాధి నివారణలు, కూరగాయల సాగు, లాంటి అంశాలను రైతులను ప్రోత్సహిస్తూ సమీకృత వ్యవసాయ పద్ధతులను(ఇంటి గ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టం) ద్వారా రైతులను ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతున్నారు.

సాంకేతికతను అందించడమే లక్ష్యం



రైతులకు సాంకేతికపరమైన నూతన సాగువిధానాలను అందించడమే కేవీకే లక్ష్యం.. రైతులు మెరుగైన శిక్షణను అందించి ప్రకృతి వ్యవసాయం, ఆధునిక పద్ధతులు, సేంద్రియ ఎరువులు, తెగుళ్ల నివారణకు పలు రకాల కషాయాలు తయారు చేసుకునే తీరుపై నూతన మెలుకవలు అందిస్తున్నాం. సేంద్రియ ఎరువులను రైతు సొంతంగా తయారు చేసుకునే విధంగా శిక్షణను అందించి పెట్టుబడి తగ్గి దిగుబడి పెరిగేలా కృచేస్తున్నాం. తక్కువ నీటితో కూరగాయల సాగుకు సూచనలిస్తున్నాం. రైతులకు క్షేత్ర స్థాయిలో నూతన సాంకేతిక విధానాలపై అవగాహన కల్పించి రైతు సంక్షేమంపై దృష్టి పెట్టడమే కేవీకే లక్ష్యం.

- డాక్టర్ రాజన్న, కృషివిజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ మామునూరు

టీచింగ్, నాన్‌టీచింగ్ ఖాళీల భర్తీకి కృషి

● పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



మల్లన్నను సన్మానిస్తున్న వివిధ సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని టీచింగ్, నాన్‌టీచింగ్ ఖాళీ పోస్టుల భర్తీకి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నోటిఫికేషన్ ఇచ్చేలా కృషి చేస్తానని ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత తొలిసారిగా బుధవారం కేయూకు రాగా.. లైబ్రరీ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ మేధావుల ఫోరం యూత్ కాంగ్రెస్ నాయకులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు సన్మానించారు. ఈసందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. ఈనెల 28న సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌కు వస్తున్నారని సమస్యలుంటే సీఎంకు కలిసే అవకాశం కల్పిస్తానని తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ శాసనమండలిలో రీకాల్ చేసే ప్రైవేట్ బిల్లును ప్రవేశపెట్టాలనే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు. అనంతరం కేయూ లైబ్రరీ ఆవరణలో నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ మేడారపు సుధాకర్, ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి నరేష్ ఇతర సంఘాల బాధ్యులు మల్లన్నను ఘనంగా సన్మానించారు. ప్రొఫెసర్ వీరన్ననాయక్, డాక్టర్ గజ్జల మల్లేష్, ఆలువాల కార్తీక్, తీగల ప్రేమ్‌కుమార్, మంద వీరస్వామి, జవహర్, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మ్-డీ విద్యార్థుల ఆందోళన

● పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్
● పరీక్షల నియంత్రణాధికారితో వాగ్వాదం



కేయూలో పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారిని చుట్టుముట్టిన విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని వివిధ ఫార్మసీ కళాశాలల ఫార్మ్-డీ మూడో సంవత్సరం విద్యార్థులకు జూలై 1నుంచి పరీక్షలు నిర్వహించేందుకు ఇటీవల పరీక్షల విభాగం అధికారులు టైం టేబుల్‌ను విడుదల చేశారు. అయితే ఆ పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీ అనుబంధ నగరంలోని పలు ప్రైవేట్ ఫార్మసీ కాలేజీల ఫార్మా-డీ విద్యార్థులు బుధవారం సాయంత్రం కేయూ పరీక్షల విభాగంలో ఆందోళనకు దిగారు. పరీక్షల విభాగంలోకి చొచ్చుకెళ్లి ఆందోళన చేశారు. పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారితో వాగ్వాదానికి దిగారు. తమకు అలుమనాక్ ప్రకారం 180రోజుల పాటు క్లాస్ వర్కింగ్ డేస్‌గా ఉండాలని, కానీ క్లాస్ వర్కింగ్ డేస్, సిలబస్ కూడా పూర్తి కాలేదని కావున పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. పరీక్షలు నిర్వహిస్తే తాము నష్టపోయే పరిస్థితి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి పలు విద్యార్థిసంఘాల బాధ్యులు మద్దతుపలికారు. కాగా, పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారి మాట్లాడుతూ.. సిలబస్ పూర్తి కాకుండే మీ కళాశాల ప్రిన్సిపాల్స్‌ను అడగాలని, పరీక్షలు ఆలస్యమైతే ఫలితాల విడుదల అలస్యమయ్యే పరిస్థితి ఉంటుందన్నారు. కేయూ ఫార్మసీ కాలేజీ డీన్ ఆచార్య గాదె సమ్మయ్య, యూనివర్సిటీ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ప్రసాద్‌తో పరీక్షల విభాగంలో నర్సింహాచారి మాట్లాడారు. కాగా, ఆందోళన కొనసాగుతోండగా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పరీక్షల విభాగం నుంచి విద్యార్థులను బయటికి వెళ్లాలని సూచించారు. పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య నర్సింహాచారి తన కారులో వెళ్లేందుకు ప్రయత్నించగా విద్యార్థులు అడ్డుకున్నారు. పరీక్షలు వాయిదా వేసినట్లు ప్రకటించడంతోపాటు, లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వాలని కోరారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. రిజిస్ట్రార్ మల్లారెడ్డి అందుబాటులో లేరని, వచ్చాక రిజిస్ట్రార్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరీక్షలు వాయిదా వేసే విషయంపై ప్రకటిస్తామని నర్సింహాచారి చెప్పారు. అయినప్పటికీ విద్యార్థులు ఆందోళన కొనసాగించారు. చివరికి వాయిదా వేస్తాం కానీ, ఎన్నిరోజుల అనేది రిజిస్ట్రార్‌తో మాట్లాడి ప్రకటిస్తామని నర్సింహాచారి హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఈ విషయంపై పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారిని 'సాక్షి' వివరణ కోరగా ఫార్మా-డీ కోర్సు క్యాంపస్‌లో లేదు. ప్రైవేట్ ఫార్మసీ కాలేజీల్లోనే ఫార్మ్-డీ కోర్సు ఉందన్నారు. అలుమనాక్ రూపొందించేది యూనివర్సిటీ ఫార్మసీ కాలేజీ డీన్, ప్రిన్సిపాల్, బీఓఎస్ అని.. వారు సమన్వయంతో అలుమనాక్ రివైజ్డ్ ఇస్తే దానికి అనుగుణంగా పరీక్షల వాయిదాపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

అరుదైన వ్యాధికి అద్భుత చికిత్స

● ప్రాణాపాయం తప్పిన రోగి
● యశోద ఆస్పత్రి డాక్టర్ నాగార్జున



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నాగార్జున

హన్మకొండ: అరుదైన వ్యాధికి అత్యాధునిక చికిత్స అందించి రోగిని ప్రాణాపాయం నుంచి కాపాడామని యశోద ఆస్పత్రి క్లీనికల్ అండ ఇంటర్వెన్షనల్ పల్మోనాలజీ సీనియర్ కన్సల్‌టెంట్, హాస్పిటల్ క్లీనికల్ డైరెక్టర్ డాక్టర్ నాగార్జున మాటూరు తెలిపారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని యశోద క్లినిక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండలం నీరుకుళ్లకు చెందిన దుండి శైలజ తీవ్రమైన స్క్రబ్ టైఫస్, మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్స్‌తో బాధపడుతూ హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్‌లో చేరిందని తెలిపారు. ఆమెకు పరీక్షలు నిర్వహించగా స్క్రబ్ టైఫస్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. ఈ వ్యాధి ఉన్న వారు తీవ్రమైన శ్వాసలోపం, కడుపు నొప్పి, శరీర నొప్పులు, ఆక్సిజన్ అందక ఇబ్బందులు పడుతారని తెలిపారు. శైలజను ఆస్పత్రిలో చేర్పించుకుని విజయవంతంగా చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి కాపాడినట్లు తెలిపారు. తన ఆధ్వర్యంలో నెఫ్రాలజీ, హెమటాలజీ, కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలాజిస్టు నిపుణులతో కూడిన వైద్యబృందం చికిత్స అందించిందన్నారు. మల్టీడిసిప్లనరీ విధానాన్ని ఉపయోగించి అసాధారణమైన సంరక్షణను అందించి సంక్లిష్ట నిర్వహణలో సత్వర, సమన్వయంతో కూడిన వైద్య చికిత్సను అందించామన్నారు. తాము అందించిన చికిత్సతో శైలజ కోలుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం దుండి శైలజ మాట్లాడుతూ.. యశోద ఆస్పత్రి డాక్టర్లు మంచి చికిత్స అందించి తనను బాగు చేశారన్నారు.

స్పోర్ట్స్ కౌన్సిల్‌పై వీడిన సందిగ్ధత

● కమిటీ లేక నిలిచిపోయిన కార్యక్రమాలు
● కమిటీ చైర్మన్‌గా ఎన్పీడీసీఎల్‌లో పూర్వ సర్కిల్ ఎస్ఈ



హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ స్పోర్ట్స్ కౌన్సిల్‌పై సందిగ్ధత వీడింది. టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి కమిటీపై స్పష్టత ఇచ్చారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత, వీటికి అనుగుణంగా నూతన సర్కిల్‌లు ఏర్పాటు కావడంతో ఈ సందేహాలు ఎక్కువయ్యాయి. గతంలో ఉన్న పూర్వ సర్కిల్ స్థాయి కమిటీ ఎన్నిక, నిర్వహణ తీరు క్రీడాకారుల ఎంపికపై పలు ఉద్యోగ సంఘాలు అభ్యంతరాలు లేవనెత్తాయి. ఈ క్రమంలో పూర్వ వరంగల్ స్థాయిలో పని చేస్తున్న కమిటీ బాధ్యుడు రాజీనామా చేయడంతో ఉమ్మడి జిల్లాలో కమిటీ నిర్వీర్యమైంది. ఈ నేపథ్యంలో ఆయా యూనియన్‌లు నూతన క్రీడా కమిటీ ఏర్పాటు చేయాలని ఎన్పీడీసీఎల్ సీఎండీని కోరాయి. నూతనంగా ఏర్పాటైన సర్కిళ్ల వారీగా క్రీడా కమిటీలు వేయాలని కొన్ని సంఘాలు, ఉమ్మడి జిల్లా స్థాయిలోనే నూతన కమిటీని ఏర్పాటు చేయాలని, సభ్యత్వ కార్యక్రమం చేపట్టి ఎన్నికలు నిర్వహించాలని మరికొన్ని యూనియన్‌లు కోరాయి. వీటన్నింటిని పరిశీలించిన సీఎండీ వరుణ్ రెడ్డి స్పోర్ట్స్ కమిటీ నిర్మాణం, క్రీడాకారుల ఎంపికపై మార్గదర్శకాలు జారీ చేశారు. టీజీ ఎన్పీడీసీఎల్‌లోని ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, అదిలాబాద్ జిల్లాల వారీగా కమిటీలు ఉంటాయని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ కమిటీకి పూర్వ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) చైర్మన్‌గా వ్యవహరిస్తారని, పూర్వ సర్కిల్‌కు చెందిన డివిజనల్ ఇంజనీర్ (టెక్నికల్) కన్వీనర్‌గా, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ కోశాధికారిగా, ఉమ్మడి జిల్లాలోని అపరేషన్ సర్కిల్‌ల ఎస్ఈలు సభ్యులుగా ఉంటారని తెలిపారు. వీరితోపాటు క్రీడాకారుల్లో 10సంవత్సరాల అనుభవం కలిగి ఉండి ఇంటర్ సర్కిల్, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్న వారిలో ముగ్గురు సభ్యులుగా ఉంటారని, మరో సభ్యుడిని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి నియమించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వాలీబాల్, క్రికెట్, టేబుల్ టెన్నిస్, షటిల్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, కబడ్డీ, క్యారమ్స్ వంటి క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారుల నుంచి ముగ్గురిని తీసుకోనున్నారు. ఉమ్మడి సర్కిల్‌లోని క్రీడాకారుల సామర్థ్యం, ప్రతిభ ఆధారంగా పారదర్శకంగా క్రీడాకారులను ఈవెంట్‌ల వారీగా ఎంపిక చేయాలని స్పోర్ట్స్ కౌన్సిల్‌కు సూచించారు. ప్రతి సంవత్సరం స్పోర్ట్స్ క్యాలండర్‌ను అనుసరించి క్రీడాకారుల ఎంపిక పూర్తి చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు సంబంధిత ఆటల్లో పాల్గొనేలా స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్ ఉత్తర్వులు జారీ చేస్తారు. ఉద్యోగులు ఆయా సర్కిల్‌ల పరిధిలో ఎస్ఈల కంట్రోల్‌లో పని చేస్తారని, ఉమ్మడి జిల్లా కమిటీ ఉంటే ఇతర సర్కిల్‌లకు చెందిన క్రీడాకారులకు క్రీడల్లో పాల్గొనేందుకు స్పోర్ట్స్ కౌన్సిల్ పేరుతో క్రీడాకారుల ఎంపిక, క్రీడల్లో పాల్గొనేలా స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్ ఉత్తర్వులు జారీ చేయాలని మార్గదర్శకాల్లో స్పష్టంగా పేర్కొన్నారు.

టీజీ ఎన్పీడీసీఎల్ జారీ చేసిన మార్గదర్శకాల మేరకు హనుమకొండ, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, అదిలాబాద్ ఆపరేషన్ సర్కిల్‌ల సూపరింటెండెంట్ ఇంజనీర్లు స్పోర్ట్స్ కౌన్సిల్‌ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. మార్గదర్శకాలను అనుసరించి, ఎన్నికలు నిర్వహించాలని స్పోర్ట్స్ కౌన్సిళ్ల సజావుగా పని చేసేలా చూడాలని, క్రీడాకారుల ఎంపిక, క్రీడల నిర్వహణ ప్రక్రియ సాఫీగా నిర్వహించాలని సూచించారు.

పోక్సో కేసులో ఒకరికి రెండేళ్ల జైలు



మహబూబాబాద్ రూరల్ : బాలికపై అత్యాచారయత్నం చేసిన ఓ వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ బుధవారం తీర్పు వెలువరించారు. కోర్టు డ్యూటీ అధికారి, పోలీసు కానిస్టేబుల్ జటంగి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని గార్ల మండలం కోట్యానాయక్ తండాకు చెందిన తేజావత్ చందు.. 2022 మార్చి 17వ తేదీన ఓ మైనర్‌పై అత్యాచారయత్నం చేశాడు. దీంతో బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రవి కేసు నమోదు చేసి విచారణ అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. వాదోపవాదనలు విన్న అనంతరం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్ తేజావత్ చందుకు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. అదేవిధంగా పరిహారంలో భాగంగా బాధితురాలికి రూ.4లక్షలు మంజూరు చేశారు. నిందితుడికి శిక్ష పడేవిధంగా విధులు నిర్వర్తించిన ఎస్సై జీనత్ కుమార్, పీసీ జె.రాజును ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, డీఎస్పీ తిరుపతిరావు, బయ్యారం సీఐ రవికుమార్ అభినందించారు.

అత్యాచారయత్నం కేసులో..

స్టేషన్‌ఘన్‌పూర్: అత్యాచారయత్నం కేసులో నిందితుడైన మండలంలోని సముద్రాల గ్రామానికి చెందిన పులి రజనీకుమార్‌కు జనగామ పోక్సో జడ్జి రవీందర్‌శర్మ ఏడాది కఠిన కారాగార శిక్ష, బాధితురాలికి రూ.2లక్షల పరిహారం ఇచ్చేలా తీర్పు ఇచ్చి నట్లు ఘన్‌పూర్ ఎస్సై నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సముద్రాలకు చెందిన రజనీకుమార్ 2023లో మైనర్‌పై అత్యాచారయత్నం చేయగా నిందితుడిపై అప్పటి సీఐ రాఘవేందర్ కేసు నమోదు చేశారు. వాదోపవాదనల అనంతరం నిందితుడికి శిక్ష ఖరారైనట్లు పేర్కొన్నారు. సాక్ష్యులను కోర్టులో హాజరుపర్చిన సీఐ ముస్కు రాజు, కోర్టు కానిస్టేబుల్ సంతోష్, కోర్టు లైసన్ ఆఫీసర్ సారంగపాణిని అధికారులు అభినందించారు.

విద్యుత్ పనులు త్వరగా పూర్తి చేయాలి

● ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి
● కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో విద్యుత్ పనుల పరిశీలన



విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

గీసుకొండ: గీసుకొండ- సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు(కేఎంటీపీ)లో చేపట్టిన విద్యుత్ సరఫరా పనులను త్వరగా పూర్తి చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం నగరానికి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి కేఎంటీపీని సందర్శించే అవకాశం ఉంది. దీంతో బుధవారం కేఎంటీపీలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను వరుణ్‌రెడ్డి సందర్శించి మాట్లాడారు. పార్కుకు విద్యుత్ సరఫరాను అందించే 220/132/33 కేవీ పనులను త్వరగా పూర్తి చేసి యంగ్‌వన్, కై టెక్స్ కంపెనీలకు నాణ్యమైన సరఫరా అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు లోడ్ మానిటరింగ్ చేసుకుని విద్యుత్ వాడకం అధికంగా ఉండే(పీక్ అవర్) సమయంలో లోడ్‌ను చెక్ చేసుకోవాలని తెలిపారు. సబ్ స్టేషన్లను ప్రణాళిక ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వరంగల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మధుసూదన్‌రావు, డీఈలు ఆనందం, అనిల్‌కుమార్, ఏడీఈ నర్సింహారావు, మచ్చాపూర్ ఏఈ సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

కేటీపీపీలో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

● రెండు ప్లాంట్లలో బాయిలర్ ట్యూబ్ లీకేజీ
● 500 మెగావాట్ల ప్లాంటులో పూర్తిగా నిలిచిన ఉత్పత్తి

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరు కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలోని మొదటి దశ 500 మెగావాట్లు, రెండవ దశ 600 మెగావాట్ల ప్లాంట్లలో బుధవా రం ఉదయం బాయిలర్ ట్యూబ్ లీకేజీతో విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. 600 మెగావాట్ల పాంట్‌లో బాయిలర్ ట్యూబ్ లీకేజీ సమస్య చిన్నగా ఉండడంతో విద్యుత్ ఉత్పత్తి వరుసగా మరో 5రోజులు కొనసాగిస్తే 200రోజులపాటు విద్యుత్ ఉత్పత్తిని కొనసాగించిన ప్లాంట్‌గా మైలురాయిని చేరుకోనుంది. ఈరికార్డు కోసం ఉత్పత్తిని అధికారులు గంటల వ్యవధిలోనే ప్రా రంభించారు. 500 మెగావాట్లలో బాయిలర్ ట్యూబ్ లీకేజీ పనులు ప్రారంభించిన అధికారులు 600 మెగావాట్లలో మాత్రం ఎంత కష్టమైన వరుసగా 200 రోజులు విద్యుత్ ఉత్పత్తి చేసి రికార్డు చేయాలని కృషి చేస్తున్నారు. ఒక వేళ రెండు ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోతే రోజుకు ప్రభుత్వానికి రూ.4కోట్ల వరకు నష్టం వాటిల్లేదని కేటీపీపీ అధికార వర్గాలు తెలిపాయి.

జూలై 2న మొదటి దశ 500 మెగావాట్లలో మరమ్మతులు

కేటీపీపీ మొదటి 500 మెగావాట్లలో వార్షిక మరమ్మత్తులు (ప్లాంటు ఓవర్‌హాలింగ్) పనులు జూలై 2న ప్రారంభించనున్నారు. సుమారు 20 రోజుల ప్లాంటును పూర్తిగా నిలిపివేసి మరమ్మతు పనులు చేయనున్నారు. దీని పనులు పూర్తయిన తరువాత రెండవ దశ 600 మెగావాట్లలో వార్షిక మరమ్మత్తుల పనులు ప్రారంభించడానికి అధికారులు తేదీని ఖరారు చేయనున్నారు.

దండం పెడతాం.. సాగు భూములు వదలండి

గూడూరు: నలభై సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నం సారూ.. సాగు భూములు వదలండని ఫారెస్టు అధికారులను పోడు రైతులు వేడుకుంటున్న ఘటన మహబూబాబాద్ జిల్లా ఫారెస్టు రేంజ్ పరిధిలోని గూడూరు మండలం బొల్లెపల్లి, నాయకపల్లి ఫారెస్టులో బుధవారం సాయంత్రం జరిగింది. వివరాల ప్రకారం.. మానుకోట ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని బొల్లెపల్లి, నాయకపల్లి గ్రామాల నడుమ కొన్ని సంవత్సరాలుగా పోడు భూముల్లో సాగుచేస్తున్న గిరిజన, ఇతర కులాలు.. ఫారెస్టు అధికారుల మధ్య ప్రతి ఏడాది వాగ్వాదం జరుగుతుంది. ఈక్రమంలో గత మూడు రోజులుగా రైతులు దున్నుకుంటున్న పోడు భూముల వైపు వస్తున్న మానుకోట రేంజ్ ఫారెస్టు అధికారులు ఆ భూముల్లో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు రోజులుగా రైతులు అడ్డుకుంటున్నారు. ఈనేపథ్యంలో మొక్కలు పట్టుకొని వచ్చిన ఫారెస్టు అధికారులతో బొల్లెపల్లి, నాయకపల్లి గ్రామాల రైతులు సారూ.. 40 సంవత్సరాలుగా దున్నుకుంటున్నం, గత 10, 15 సంవత్సరాల క్రితం మా పక్కనే కొత్తగా కొట్టిన ఫారెస్టు భూములకు హక్కు పత్రాలు ఇచ్చారు. మాకు ఇవ్వలేదు. దయచేసి మా భూములు మాకు వదలండి. లేదంటే ఇక్కడే చస్తాం అంటూ చేతులు జోడించి వేడుకుంటున్నారు. ఆ సమయంలో వర్షం కురువడంతో అధికారులు మళ్లీ వద్దాం.. అనుకుంటూ వెళ్లిపోవడంతో వివాదం తాత్కాలికంగా వాయిదాపడింది.